క్లుప్తంగా

పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలు శాంతియుతంగా జీవించాలని, భయభ్రాంతులకు గురికావద్దంటూ నున్న పోలీసులు శుక్రవారం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. నున్న పోలీసు స్టేషన్ సీఐ ఎస్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సుందరయ్యనగర్, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజల్లో మనోధైర్యం కలిగిస్తూ ఫుట్ పెట్రోలింగ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం నగరంలో అక్కడక్కడ శాంతియుత వాతావరణానికి భిన్నంగా జరుగుతున్న సంఘటనలకు ప్రజలు ప్రభావితం కారదని సీఐ దుర్గాప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అహర్నిశలు వైఎస్సార్ సీపీ పటిష్టత కోసం పనిచేసిన ఉండేటి నాగేశ్వరరావు లేని లోటు తీరనిదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక శాంతి నగర్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు ఉండేటి నాగేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన నగరపాలక సంస్థకో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్ పాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉండేటి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేడు భౌతికంగా ఆయన మన మధ్యలో లేకున్నప్పటికీ ఆయన అందించిన సేవలు ప్రతి ఒక్కరి మదిలోనూ ఎన్నటికీ నిలిచే ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంత్ కుమార్ సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పట్టణ ఆరోగ్యకేంద్రంలో 20 సంవత్సరాలు కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా దాసరి ప్రశాంత్‌కుమార్ అందించిన సేవలు నిరుపమానం అని ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయేషా అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగవిరమణ చేసిన దాసరి ప్రశాంత్‌కుమార్ అభినందన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో చురుగ్గా సేవలు అందించేవారని కొనియాడారు. ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ తన ఉద్యోగ నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కుమార్ దంపతులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బావాజీపేట సాంబమూర్తి రోడ్డులో శుక్రవారం బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ బీ వసంతకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవాకార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుర్రం ఏడు కొండలు, కె. రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం వివరాలు తెలుపుతూ ప్రతి రోజూ స్వామివారికి ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 27న రాత్రి ఏడు గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామివారికి, రమా సహిత సత్యనారాయణ స్వామివార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 29న ఉదయం 11.30 గంటలకు భక్తులకు అన్నసమారాధన ఉంటుందని భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని అభివృద్ధి కమిటీ కోరింది.

కర్రసాముతో ఆత్మరక్షణ

- కర్రసాముపై ఆసక్తి చూపుతున్న చిన్నారులు, యువత
- వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ



కర్రసాములో సాధన చేస్తున్న చిన్నారులు, యువకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఓ ప్రాచీన యుద్ధకళ అది.. అంతఃపురంలో ఉన్నవారి దగ్గర నుంచి పూరి గుడిసెలో నివసించే సామాన్య ప్రజలందరి ఆయుధమది. ప్రాణాలు తీసే క్రూర మృగాల నుంచి.. దాడులు చేసే శత్రుమూకల బారి నుంచి కాపాడే రక్షణ కవచం అది. ఒకప్పుడు రాజ్యమేలిన ఆ కర్రసాము మారుతున్న పరిస్థితుల్లో కనుమరుగవుతోంది. అయితే ఆదరణకు నోచుకోని ఆ కర్రసాముపై నేటి యువత, చిన్నారులు ఆసక్తి చూపుతుండటం విశేషం.

ఆత్మరక్షణతోపాటు మంచి వ్యాయామం..

మన సంప్రదాయంలో ఓ భాగంగా చెప్పుకునే కర్రసాము నేర్చుకుంటే ఆత్మరక్షణకు తోడ్పడుతుంది. శరీరానికి చక్కని వ్యాయామం లభిస్తుంది. దీంతో తమకు డబుల్ ధమాకా ఆఫర్ వచ్చినట్లు భావిస్తున్న వారంతా కర్రసాము నేర్చుకునేందుకు ఆసక్తిని చూపుతున్నారు. నిత్యం మొబైల్ ఫోనుల్లో నిమగ్నమైపోయి మెదడులో ఆలోచనా శక్తిని కోల్పోతూ.. చిన్న చిన్న విషయాలకు కూడా భయపడిపోయే మనస్తత్వాలను అలవర్చుకుంటున్న తమ పిల్లలకు కాస్త ధైర్యాన్ని పంచే ఆయుధంగా కర్రసాము కనిపిస్తోంది. దీంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు కర్రసాము నేర్పిస్తున్నారు.

నామమాత్రపు ఫీజులతో..

ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో చిన్నారులందరికీ కర్రసాములో శిక్షణ ఇస్తున్నారు. సంప్రదాయ కళను కాపాడాలనే లక్ష్యంతో సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో కొంతమంది కర్రసాములో శిక్షణ ఇస్తున్నారు. నెలకు రూ.500 ఫీజుతో ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు కర్రసామును నేర్పుతున్నారు.



కర్రసాములో ఉత్సాహంగా సాధన చేస్తున్న చిన్నారులు

ప్రతి ఒక్కరూ నేర్చుకోవచ్చు..



కర్రసాము అనే విద్యను వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నేర్చుకోవచ్చు. ఈ వేసవి సెలవుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఆసక్తి చూపడం చాలా సంతోషంగా ఉంది. కర్రసాము నేర్చుకోవడం వల్ల మన ఆత్మ రక్షణతో పాటు పోటీ ప్రపంచంలో గెలుపోటములను తట్టుకొనే శక్తి పెరుగుతుంది. వంద మంది వరకూ మా దగ్గర శిక్షణ తీసుకుంటున్నారు. వీరందరికీ కర్రసాములో అన్ని మెలకువలను నేర్పిస్తున్నాం. ప్రస్తుత రోజుల్లో యువతులు, మహిళలు తప్పనిసరిగా కర్రసాముపై అవగాహన పెంచుకోవడం చాలా మంచిది.

–ఈ.ప్రదీప్‌కుమార్, కర్రసాము, శిక్షకుడు

ఆత్మవిశ్వాసం పెరిగింది..



ఇంతకు ముందు కర్రసాము గురించి విన్నప్పుడు ఆ ఏముందిలే అనుకునేదానిని. కానీ నేర్చుకున్న తరువాత చాలా విషయాలు అర్థమయ్యాయి. కర్రసాము నేర్చుకోవడం వల్ల నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మహిళలందరూ కచ్చితంగా కర్రసాము నేర్చుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విద్య చాలా అవసరం.

–దేవి

చిన్నప్పటి నుంచి ఆశ



కర్రసాము నేర్చుకోవాలని చిన్నప్పటిని నుంచి ఎంతో ఆశగా ఉండేది. కానీ ఎక్కడ నేర్పిస్తారు, ఎవరు నేర్పిస్తారో తెలియక అలా ఉండిపోయా. ఇప్పుడు సింగ్‌నగర్ స్టేడియంలో కర్రసాము నేర్పడాన్ని చూసి రెండు నెలల నుంచి కర్రసాము నేర్చుకుంటున్నా. కర్రతిప్పడం చాలా బాగా నేర్చుకున్నా. ఇంకా చాలా మెలకువలు ఉన్నాయి. వాటిని కూడా క్రమంగా నేర్చుకొని దీనిలో పట్టుసాధిస్తా.

–సౌజన్య

ఆత్మరక్షణ, వ్యాయామం..



కర్రసాము నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణగా ఉంటుందని చేరాను. ఇక్కడ కర్రసాము నేర్చుకుంటుంటే అర్థమైందేంటంటే ఇది ఆత్మరక్షణతో పాటు శరీరానికి కూడా చక్కని వ్యాయామంగా పనికివస్తోంది. మనలో భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని నింపుతుంది. ఎదురుగా ఎంతమంది ఉన్నా.. ఎంత పెద్ద సమస్య అయినా ధైర్యంగా పోరాడి విజయం సాధించవచ్చేనే నమ్మకం కలిగింది.

–రాజశేఖర్

అలరించిన అన్నమయ్య సంకీర్తనా స్రవంతి



సంకీర్తనలను గానం చేస్తున్న సీవీపీ శాస్త్రి



సంకీర్తనలను గానం చేస్తున్న చారుమతీ పల్లవి

విజయవాడ కల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంకీర్తన అకాడమీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నమయ్య సంకీర్తనా స్రవంతి మధురంగా సాగుతోంది. శుక్రవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారులతో పాటు ప్రముఖ సంగీత విద్వాంసులు అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. అదివో అల్లదివో శ్రీహరివాసము, తిరువీధుల తిరిగే దేవ దేవుడు, బ్రహ్మ మొక్కటే తదితర కీర్తనలను హైదరాబాద్‌కు చెందిన శివసాయి చరణ్, మల్లాది అనన్య, చారుమతీ పల్లవి, మల్లాది అభిజ్ఞ, మేడూరి రఘురాం, కె.గోపాల రావు, మేడూరి శివరాం, గాయత్రీ గౌరీనాథ్, సీవీవీపీ శాస్త్రి ఆలపించారు. సత్యబాబు, ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు: ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. మోదుమూడి అంజనా సుధాకర్, ఎ.కోదండ రామయ్య, జీవీఆర్ సంగీత కళాశాల విద్యార్థులు లంక తేజస్వి తదితరులు అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తారు.

లారీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లారీడ్రైవర్ అదృశ్యమైన ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ ఆసిఫాబాద్ ఓంకాపూర్‌కు చెందిన నల్ల సంతోష్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఈ నెల 15వ తేదీన ఆదిలాబాద్ నుంచి లోడ్‌తో వైవీ రావు ఎస్టేట్ ఎన్నార్ రోడ్డుకు వచ్చాడు. సరుకు అన్‌లోడ్ అవుతుండగా స్నానం చేసి వస్తానని చెప్పి సంతోష్ బయటకు వెళ్లాడు. బయటకు వెళ్లిన సంతోష్ ఎంతకు రాకపోవడంతో క్లీనర్ విజయ్ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో సంతోష్ తండ్రి చంద్రయ్య నగరానికి చేరుకుని కుమారుడి అదృశ్యంపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పెళ్లి చేసుకుంటానని బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లిన యువకుడిపై భవానిపురం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యాధరపురానికి చెందిన 13 ఏళ్ల బాలిక నగరంలోని ఓ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. స్కూల్‌కు వెళ్లి వచ్చేటప్పుడు గణేష్ అనే యువకుడు ప్రేమించానని బాలిక వెంట పడేవాడు. విషయం ఇంట్లో తెలిసి బాలికను కుటుంబ సభ్యులు మందలించారు. ఈ విషయం తెలుసుకున్న గణేష్ ఇద్దరం స్నేహితులుగా ఉందామని చెప్పి ఇంటి నుంచి వచ్చేయమని బాలికను నమ్మబలికాడు. గురువారం సాయంత్రం బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. శుక్రవారం కుటుంబ సభ్యులు బాలిక కోసం వెదకడం ప్రారంభించారు. బాలిక గణేష్ ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఆమెను వివరాలు అడగ్గా తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి తీసుకు వచ్చాడని తెలిపింది. దీనిపై బాలిక కుటుంబ సభ్యులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్ బోర్డ్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఎంఐజీ–2 బ్లాకులు, పోలీస్ స్టేషన్ రోడ్డు, వీఎంసీ కల్యాణమండపం ఏరియా, హెచ్‌ఐజీ బ్లాకులు, రిలయన్స్ ఫ్రెష్, హెచ్‌ఆర్డీ సాయి నిర్మాణ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.


కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో...

విద్యాధరపురం కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ సితార విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కబేళా సెంటర్, కోట నాగేశ్వరరావు వీధి, గణేష్ వీధి, ఆకుల సాంబయ్య వీధి, నాగ సాయిబాబా టెంపుల్ ఏరియా, బ్రహ్మయ్య కాలనీ, మిల్క్ కాలనీ, రోటరీ నగర్, మిథిలానగర్, సితార సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

చిట్టినగర్ సెక్షన్ పరిధిలో...

చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 11 కేవీ రాజీవ్ శర్మ నగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం రెండు గంటల సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వీజీఎస్ వెనుక ప్రాంతం, దీన్‌దయాళ్ నగర్, సౌమ్య థియేటర్ వెనుక ప్రాంతం, అంబేడ్కర్ బొమ్మ ప్రాంతం, ఆర్‌కే కుటీర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లండన్ డేటా వాలీ సంస్థతో సిద్ధార్థ కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న కళాశాల, కంపెనీ ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాలలో డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు అధునాతన సాంకేతిక పద్ధతుల్లో విద్యాబోధన సాగించేందుకు లండన్‌లోని డేటా వాలీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, డేటా వాలీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి చలమలశెట్టి పవన్ ఒప్పంద పత్రాలను కళాశాల ఆవరణలో శుక్రవారం మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం వల్ల సాంకేతిక సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు, పాఠ్యప్రణాళికలు రూపొందించడం, పరిశోధనలు, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులతో పాటుగా అధ్యాపకులకు బోధించడానికి డేటా వాలీ సంస్థ, తమ కళాశాల కలిసి పనిచేస్తాయని రమేష్ చెప్పారు. పవన్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, కృత్రిమ మేధస్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటుగా ఉద్యోగం పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. అధ్యాపకులు కె.ఉదయశ్రీ , కె.సుధీర్‌తో పాటుగా డేటావాలీ సంస్థ కమర్షియల్ డైరెక్టర్ కె.మురళీమోహన్ పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి గ్రామోత్సవం

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవసంత వేణుగోపాలస్వామివారి ఆలయంలో శుక్రవారం గ్రామోత్సవం ఘనంగా చేశారు. స్వామివారి కల్యాణం గురువారం రాత్రి జరగడంతో శుక్రవారం స్వామివార్ల విగ్రహాలు ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదిక్షణలు, పవళింపు సేవ చేశారు.

గంగూరులో బైక్ చోరీ

పెనమలూరు: గంగూరులో డెలివరీ బాయ్ బైక్ చోరీ జరగడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగూరు గ్రామం మసీదు రోడ్డుకు చెందిన కల్వ సాయిసంతోష్ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తాడు. అతను ఈ నెల 14వ తేదీన పని ముగించుకుని ఇంటికి వచ్చి ఇంటి ఎదుట బైక్ పార్కు చేశాడు. మరల 15వ తేదీ ఉదయం లేచి చూసుకునే సరికి గుర్తు తెలియని వ్యక్తి అతని బైక్ చోరీ చేశారు. అతను బైక్ కోసం పలు ప్రాంతాల్లో వెతికాడు. బైక్ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి తూముల సెంటర్‌కు చెందిన పాల్వాయి ఉమారాణి తొమ్మిదేళ్ల క్రితం రామకృష్ణకు కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఏ పనులు చేయకుండా ఇంట్లోనే ఉంటూ మద్యం సేవిస్తాడు. భార్య ఉమారాణి విజయవాడలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ కుటుంబ పోషణ చూస్తుంది. కాగా భర్త అదనపు కట్నం కావాలని తరచుగా మద్యం సేవించి భార్య ఉమారాణిని వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా రామకృష్ణపై కేసు నమోదు చేశారు.

రూ.15 కోట్లతో 63వ డివిజన్‌లో అభివృద్ధి



63వ డివిజన్లో నిర్మించిన రోడ్డు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వ హయాంలో నిరంతరం అభివృద్ధి పనులు కొనసాగుతునే వున్నాయి. ప్రభుత్వం ప్రజల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధి పనులను ఆగకుండా చేస్తోంది ప్రభుత్వం. టీడీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోని 63వ డివిజన్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.15 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 కోట్లతో హోసన్నా ప్రార్థనా మందిరం రోడ్డు నిర్మించారు. రూ.1.20 కోట్ల వ్యయంతో డాక్టర్స్ కాలనీలో ప్రజలకు అనువైన విధంగా బీటీ రోడ్లు నిర్మించారు. ఈడబ్ల్యూఎస్ కాలనీలో రూ.1.50 కోట్ల వీఎంసీ సాధారణ నిధులతో రహదారులు నిర్మించగా, మరికొన్ని రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. రూ.80 లక్షలతో ఎల్‌ఐజీ–1,2 ఎంఐజీ కాలనీల్లో ఒకప్పుడు అధ్వాన్నంగా ఉన్న రోడ్లు నేడు అభివృద్ధితో కళ కళ లాడుతున్నాయి. డివిజన్లోని ఆరు సచివాలయాల పరిధిలో మంజూరైన రూ.1.20 కోట్ల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రాధానగర్ కాలేజీ రోడ్లు, ఎన్జీఓ ఈ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, షణ్ముఖ వాటర్ ప్లాంట్ రోడ్డు, మాస్టర్ మైండ్స్ స్కూల్ రోడ్డు సహా అనేక రహదారులను ప్రభుత్వం నిర్మించింది. రూ.50 లక్షల సీఆర్‌డీఏ నిధులతో ఎల్‌ఐజీ–1,2, కాలనీల్లో చేపట్టిన బీటీ రోడ్ల నిర్మాణం పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజల దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పించింది. సుందరయ్యనగర్లో రూ.30 లక్షలతో పైపులైన్ల వ్యవస్థను మెరుగుపర్చింది. దీంతో ఈ ప్రాంత ప్రజల తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

అలరించిన సినీ సంగీత విభావరి



గాయనీ గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: స్రవంతి కృష్ణ ఎంటర్‌టైనర్స్, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు స్రవంతి కృష్ణ, సుశీల్ కుమార్, బెల్లంకొండ భారతి, మల్లాది స్వాతి, కేఎస్ఎన్ మూర్తి, వెంకట్, శ్రావణి, ఉమా బలరాం, రుగ్వేదం సోదరీమణులు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని, వారిని గౌరవించుకోవాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనారామన్, కె.డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు గాయనీ గాయకులను సత్కరించారు.

వైఎస్సార్ సీపీకే మళ్లీ అవకాశం

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు



మైలవరం: 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకానుందని, ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే ప్రమాణ స్వీకారం చేయనున్నారని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో అధికారాన్ని చేపట్టనుందని చెప్పారు. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశ పెట్టి అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడ్డాయని, ఆ పథకాలు పొందిన లబ్ధిదారులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏకపక్షంగా పట్టం కడతారన్నారు. వైట్ కాలర్స్ కొంతమంది కూటమికి ఓట్లు వేసిన వైనంపై బలహీనవర్గాలంతా ఏకమయ్యారన్నారు. ఎన్డీఏ కూటమిలో మూడు పార్టీలు, ఇండియా కూటమిలో నాలుగు పార్టీలు అన్నీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డినా, కురుక్షేత్రంలో అర్జునుడు మాదిరి వారి ఎత్తులను చిత్తు చేస్తూ తనదైన రాజకీయ చతురతతో పేద, బడుగు, బలహీనవర్గాల మద్దతుతో మళ్లీ అధికారాన్ని చేపట్టనున్నారని చెప్పారు. మైలవరంలో నిరుపేద, సామాన్యుడు అయిన ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు జగనన్న ఆశీస్సులతో గెలుపొందుతారన్నారు.

ప్రయాణం.. ఆహ్లాదకరం



మండుతున్న ఎండలతో ప్రయాణం విసుగుగా మారుతోంది. విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్లేవారు ఎండ వేడిమితో అల్లాడుతున్నారు. కానీ గొల్లపూడి వద్దకు రాగానే ప్రయాణికులు ఒకింత సేదతీరుతున్నారు. ఇక్కడ రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు.. గొడుగులా అల్లుకున్న వాటి కొమ్మలు పచ్చందాలతో వాహన చోదకులకు కనువిందు చేస్తున్నాయి. చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన చల్లని గాలి, చెట్ల కొమ్మల నీడ వారి ప్రయాణాన్ని ఆహ్లాదకరంగా మారుస్తోంది. వాహన చోదకులు కొందరు ఇక్కడకు రాగానే కొద్దిసేపు ఆగి సేద తీరుతుండగా.. మరికొందరు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుని ముందుకు సాగుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

యోగా శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. నగరంలోని బందరురోడ్డులో ఉన్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఉన్న తమ అసోసియేషన్ హాలులో ఈ తరగుతులు జరుగుతాయని పేర్కొన్నారు. సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామంలో శిక్షణ ఇస్తామని, ఈ శిక్షణలో సాధన చేసిన వారితో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున నిర్వహించే కార్యక్రమంలో యోగాసనాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసిన వారికి తమ అసోసియేషన్ నుంచి సర్టిఫికెట్, మెడల్, టీ షర్ట్ అందజేస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేదీలోగా 90147 46719, 80082 34545, 98487 32626 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.